సీతాకోక చిలుక



కండల వీరుడు



బెలూన్లు వదులుతూ..



ఫుట్‌పాత్.. సెల్ఫీ స్పాట్

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించడానికి గాజులరామారం సర్కిల్ అధికారులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. పలు ప్రధాన కూడళ్ల వద్ద సెల్ఫీ చిత్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నారు. సూరారం బస్టాప్, షాపూర్‌నగర్ చౌరస్తా, హెచ్ఎంటీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎంతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ చిత్రాల వద్ద ప్రజలు ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్నారు. రోడ్లపై ఎక్కడి పడితే అక్కడ చెత్తాచెదారాలను వేయకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు ఇతరులకు సైతం చైతన్యం కల్పించే విధంగా ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు గాజులరామారం ఉపకమిషనర్ ప్రశాంతి 'సాక్షి'కి తెలిపారు.

– కుత్బుల్లాపూర్:

క్లుప్తంగా

ఫేర్‌వెల్ పార్టీ



నిజాంపేట్ రవీంద్ర భారతి స్కూల్‌లో ఫేర్‌వెల్ పార్టీలో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట్: క్రమశిక్షణ, నైతిక విలువలు పాటిస్తే ఉన్నత స్థానాలు అధిరోహిస్తారని నిజాంపేట్‌లోని రవీంద్రభారతి స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణిమ అన్నారు. ఆదివారం రవీంద్రభారతి స్కూల్‌కు టెన్త్ విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డీన్ శ్రీలత, ప్రిన్సిపాల్ పూర్ణిమలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులు పాఠశాలతో తమకున్న అనుబంధం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులతో అనుభవాలను పంచుకున్నారు. పరీక్షలు బాగా రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సూచించారు.

ఘనంగా నార్త్ సిటీ హైస్కూల్ వార్షికోత్సవం



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మర్రి రాజశేఖర్ రెడ్డి

సుభాష్‌నగర్: సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. అదే విధంగా ఎమ్మెల్యే వివేకానంద్ చేపట్టిన స్పీక్ ఏ బుక్ కాంపిటీషన్‌లో భాగంగా గెలుపొందిన విద్యార్థులకు ఆయన నగదు పురస్కారాన్ని అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రావుల శేషగిరి, మంత్రి సత్యనారాయణ, నిజాంపేట్ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు మన్నె బాలేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక



నిజాంపేట్: బోనాలు తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి 18వ డివిజన్‌లోని శ్రీహోమ్స్ కాలనీలోని కట్టమైసమ్మ ఆలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్లు కొలన్ వీరేందర్‌రెడ్డి, విజయలక్ష్మి, చిట్ల దివాకర్, కాసాని సుధాకర్‌ముదిరాజ్, బీఆర్ఎస్ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, నాయకులు గోపాల్‌రెడ్డి, సుబ్బారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వాగ్దానాలు చేశారు.. అమలు మరిచారు



జగద్గిరిగుట్టలో దోభీఘాట్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

జగద్గిరిగుట్ట: 2010 నుంచి ఇప్పటి వరకు రెండు, మూడు దఫాలు ఎన్నికలు జరిగినా... ముఖ్య నేతలను కలిసినా దోభీఘాట్ నిర్మాణం మాత్రం కలలాగే మిగిలిపోయింది. జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఒక్కొక్కటి రూ.5.60 లక్షలతో 2 దోబీఘాట్‌లు రజక సంఘం వారికి ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి. ఇప్పటి వరకు అమలు కాలేదు. సుమారు 12 సంవత్సరాలుగా వీరి పోరాటం కొనసాగుతుంది.

◆ కాని వీరికి స్థలం మాత్రం ఇప్పటికీ చూపించలేదు. ఈ చుట్టు పక్కల కబ్జాలు ఎక్కువ అవుతుండటంతో చేసేదేమీ లేక ఇటీవలే ఇదే సర్వే నంబర్‌లో రాజీవ్ గృహకల్ప 54వ బ్లాక్ సమీపంలో రజక సంఘం నేతలు చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేశారు. జగద్గిరిగుట్ట, రాజీవ్ గృహకల్పలో సుమారు 35 కుటుంబాలు నివసిస్తున్నాయి.

◆ ఇప్పటికైనా అధికారులు తమకు స్థలం చూపించి దోభీఘాట్ నిర్మాణ పనులు మొదలు పెట్టాలని వారు కోరుతున్నారు. దోభీఘాల్ ఏర్పాటు చేయాలని 2015 ఫిబ్రవరి 2న ఎమ్మెల్యే వివేకనంద్‌కు, 2015 జూన్ 6న జిల్లా కలెక్టర్‌కు, 2015 ఆగస్టు 9న హరీష్ రావుకు, 2016 జూన్ 18న మహమూద్ ఆలీకి పలుమార్లు వినతి పత్రాలు అందజేసారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు.

నాలుగేళ్లుగా సాగుతూ...



సంజయ్‌పురి కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీహాల్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధి సంజయ్‌పూరికాలనీలోని కమ్యూనిటీహాల్ పనులు 2018లో స్థానికుల అవసరాల నిమిత్తం రూ.కోటి అంచన వ్యయంతో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే నిధులతో వెయ్యి గజాల స్థలంలో కమ్యూనిటీహాల్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. మొదటి విడతగా రూ.40లక్షలు విడుదల కాగా ఆ తర్వాత రెండు సంవత్సరాలు పనులు నిలిచిపోయాయి. రెండో విడతగా 2022లో రూ.20లక్షలు తిరిగి నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు మంజూరైనా రూ.60లక్షలతో గ్రౌండ్ ఫ్లోర్ పనులు కూడా పూర్తి కాలేదు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ పనులు పూర్తి కావాలంటే ఇంకా రూ.60–70లక్షలు అవసరం, స్థానిక నాయకులు సహకరించి వీలైనంత తొందరగా ఈ కమ్యూనిటీహాల్ పూర్తికి తోడ్పడాలని స్థానికులు కోరుతున్నారు.

వాకిటి రాంరెడ్డికి జల కవిరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న వాకిటి రాంరెడ్డి

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్‌కు చెందిన మానస టూల్‌టెక్ అధినేత ఆత్మీయ భారతి సాహిత్య సేవ సంస్థ అధ్యక్షుడు వాకిటి రాంరెడ్డి జలకవి రత్న పురస్కారం అందుకున్నారు. ప్రపంచ నీటి వారోత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ జలమండలి, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్లబ్‌లో నిర్వహించిన జలకవితోత్సవంలో తెలంగాణ జలనిపుణులు వినోదకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా జలపరిరక్షణపై వాకిటి రాంరెడ్డి పాడిన 'జల సంరక్షణకు జైకొట్టి కదులురా.. జలసంరక్షణ నీ ధ్యేయం చేయురా..' పాటను ప్రశంసిస్తూ ఆయన్ని మెమొంటోతో సత్కరించి జల కవిరత్న పురస్కారం అందజేశారు. సభాధ్యక్షుడు గాంధీ గ్లోబల్ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి మాట్లడుతూ... తరిగిపోతున్న నీటినిల్వలపై జలకవితోత్సవం నిర్వహించడం.. కవిపుంగవులు పాల్గొని రేపటి తరానికి జలస్ఫూర్తిని కలిగించడం స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్రమములో జలమండలి, నీటిపారుదల అధికారులు, గాంధీ గ్లోబెల్ ప్రతినిధులు గోపాల్, యానాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జల కవిరత్న పురస్కారం అందుకున్న వాకిటి రాంరెడ్డిని ఆత్మీయ భారతీ సాహిత్య సేవ సంస్థ కార్యవర్గ సభ్యులు అభినందించారు.

కొంపల్లి నుంచి బహదూర్‌పల్లి రోడ్డు విస్తరణలో అక్రమాలు!

కుత్బుల్లాపూర్: కొంపల్లి నుంచి బహదూర్‌పల్లి వరకు ఉన్న రోడ్డు వెడల్పు పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని.. దీనిపై సమగ్ర విచారణ జరిపి రోడ్డును గతంలో ఉన్న మ్యాప్ ఆధారంగా ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. కొంపల్లి నుంచి దూలపల్లి మీదుగా బహదూర్‌పల్లి వరకు 250 అడుగుల వెడల్పుతో హైదరాబాద్- నాగపూర్ నేషనల్ హైవే 44కు అనుసంధానంగా గతంలో అధికారులు మ్యాపు రూపొందించి పనులు ప్రారంభించారు. అయితే కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకుల ఒత్తిడితో 150 అడుగులను తగ్గించి కేవలం 100 అడుగులు మాత్రమే వేయాలని కోరడం వెనక కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఇంజినీరింగ్ కళాశాల, పలు బహుళ అంతస్తుల నిర్మాణాలు, గేటెడ్ కమ్యూనిటీలు, పలు కాలనీలు ఏర్పాటు కావడం మూలంగా ఇక్కడ నిత్యం రద్దీ ఏర్పడుతోందన్నారు. దీనిని గుర్తించి గతంలో అధికారులు సమగ్ర సమాచారం తీసుకొని 250 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయాలని తీర్మానం చేయగా ప్రస్తుతం దూలపల్లి గ్రామానికి చెందిన పలువురి ఒత్తిడితో 100 అడుగులు మాత్రమే వేయడం తగదని హెచ్చరించారు.. ఈ విషయంపై నేషనల్ హైవే అథారిటీ అధికారులతో పాటు ఆర్ అండ్ బి అధికారులను కలుస్తామని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివకుమార్‌గౌడ్

సుభాష్‌నగర్: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని మాజీ వార్డు సభ్యుడు బైరి శివకుమార్‌గౌడ్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో శ్రీవినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. యూత్ సభ్యులు స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని కాపాడాలి



ధర్నాలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని కాపాడాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం బాచుపల్లిలోని 18వ వార్డు రేణుక ఎల్లమ్మ కాలనీలో బీజేపీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... 1989లో పార్కుతో పాటు షాపింగ్ కాంప్లెక్స్‌కు కేటాయిస్తూ లేఅవుట్ వేశామన్నారు. ఈ విషయంపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన స్పదించకపోవడం విచారకరమన్నారు. సంబంధిత అధికారులతో శ్రీశైలం గౌడ్ ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కారించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కాశి, కౌశిక్, ఉదయ్, కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నరోత్తం రెడ్డి, రఘు, నరేంద్రకుమార్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో ఆదివారం బెంగుళూరుకి చెందిన హంసిని డాన్స్ అకాడమీ పూజ ఘోష్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. సంకీర్తన అలరిపు, పరంధామనే, నర్సింహ కౌతం, అష్టలక్ష్మీ, అర్ధనారీశ్వరం, శృంగార పురధీశ్వర, మహాకాళి, దేవర్ణం, చూడరు, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు తేజశ్రీ, సూక్ష్మ, ద్రిటి, నిర్మయి, విశాఖ, మానస తదితరులు పాల్గొన్నారు.

సాయి అనురాగ్‌కాలనీ సేవా సమితి నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్‌లోని సాయి అనురాగ్ కాలనీకి చెందిన సాయి అనురాగ్‌కాలనీ సేవా సమితి నూతన కార్యవర్గాన్ని ఆదివారం కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షబ్బీర్ అహ్మద్, ఎగ్జిక్యూటీవ్ ప్రెసిడెంట్‌గా దుర్గా శ్రీనివాస్, వైస్‌ప్రెసిడెంట్లుగా రాజ్‌కుమార్, శ్రీధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా కాశ్యప్, నారాయణగౌడ్, కోశాధికారిగా ఎస్.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.సురేష్‌లు నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి కార్పోరేటర్ వీరేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

జీడిమెట్ల: ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేలా చూస్తానని మాజీ కార్పొరేటర్ బీఆర్ఎస్ నాయకులు సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సుభాష్‌నగర్ డివిజన్‌లోని ప్రియాంకనగర్‌లో సమస్యలను తెలుసుకునేందుకు ఆయన పాదయాత్ర నిర్వహించారు. కాలనీలోని ప్రజలతో మాట్లాడిన సురేష్‌రెడ్డి ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరించాలన్నారు. కాలనీవాసులతో మాట్లాడిన సురేష్‌రెడ్డి ఇప్పటికే కాలనీలో డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు సమస్యలు లేకుండా చేశామని అన్నారు. పాదయాత్రలో కాలనీ కమిటీ సభ్యులు రాము, సురేష్‌నిర్మల, పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, పులిరమణ, సుగుణ, గోపాల్, యాదగిరి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిద్రలేమి అనారోగ్యాలకు మూలం

రాయదుర్గం: నిద్రలేమి అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు మూలమని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురుఎన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ నిద్రాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నానక్‌రాంగూడ కాంటినెంటల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిద్రరుగ్మతల విభాగాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ జే.సి.సూరితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ జే.సీ.సూరి మాట్లాడుతూ నిద్రకు సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. నిద్ర రుగ్మతలపై అత్యాధునిక హంగులతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ గురుఎన్‌రెడ్డి మాట్లాడుతూ కాంటినెంటల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో నిద్ర సంబంధిత రుగ్మతల నివారణకు చికిత్స అందిస్తామన్నారు. పల్మనాలజీ విభాగం అధిపతి డాక్టర్ నళిని నాగళ్ల మాట్లాడుతూ నిద్రలేమి, తత్సంబంధిత ఇబ్బందులు అన్ని రకాల అనారోగ్య లక్షణాలకు మూలమన్నారు.

టీ మన జీవితంలో భాగమైంది

మాదాపూర్: మనిషి జీవిత దినచర్య టీ తాగడంతోనే ప్రారంభమవుతుందని, అందుకే టీ(తేనీరు) మన జీవనంలో ఒక భాగమైందని కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం హైబిజ్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీ చాంపియన్‌షిప్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. టీ విక్రయించిన వ్యక్తి ఇప్పుడు మనకు ప్రధానిగా ఉన్నారని చెప్పారు. టీలలో ఇన్ని రకాలు ఉంటాయని తనకు ఈరోజే తెలిసిందన్నారు. ఈ పోటీల్లో 200 మంది మహిళలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులను అందజేశారు.

మౌలిక వసతుల కల్పనకు కోట్లాది నిధులు వెచ్చిస్తున్నాం



దూలపల్లిలో ప్రగతియాత్ర చేపట్టిన ఎమ్మెల్యే వివేకానంద్, మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: మౌలిక వసతులను మెరుగుపరిచే దిశగా కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలోని 14, 15, 16, 17, 18 వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రగతియాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్ప కాలనీ మజీద్ వద్ద కొత్త తాగునీటి పైపులైన్ వేయాలని.. దుర్గా కాలనీలో మిగిలిన సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని... నక్షత్ర కమ్యూనిటీలో తాగునీటి వసతి కల్పించాలని.. అదే విధంగా భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ దశలవారీగా అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేయించి పనుల చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బూర్గుబావి హన్మంత రావు, వైస్‌చైర్మన్ గంగయ్య నాయక్, కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్లు సంజుయాదవ్, డప్పు కిరణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రాజు, కో.ఆప్షన్ మెంబర్ వెంకటేష్, డైరెక్టర్లు బూరుగుబావి సత్యనారాయణ, మధుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణాయాదవ్, నాయకులు దేవేందర్‌యాదవ్, నవీన్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు..పరుగు



భాగ్యలక్ష్మి కాలనీ ప్రధాన రోడ్డుపై మురుగు నీరు పరుగులు పెడుతోంది.. అటు ఇటుగా వచ్చే వాహనాలు మురుగు నీటిపై నుంచే వెళ్లడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కొత్తగా డ్రైనేజీ నిర్మించినా అవుట్‌లెట్ ఏర్పాటు చేయకపోవడంతో భాగ్యలక్ష్మి కాలనీ ప్రధాన రోడ్డులో దుర్వాసన వెదజల్లుతోంది.. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– కుత్బుల్లాపూర్


నీడనిచ్చే చెట్లను నరికేస్తారా.?



ఐడీపీఎల్ చౌరస్తాలో ఫుట్‌పాత్‌పై కుప్పలుగా చెట్ల కొమ్మలు

రంగారెడ్డినగర్: అభివృద్ధి పనుల్లో భాగంగా నీడనిచ్చే చెట్లను నరికివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ చౌరస్తాలో రోడ్డు వెడల్పు, ఫుట్‌పాత్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. అయితే సర్కిల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు కొనసాగిస్తున్నాడు. ఫుట్‌పాత్ ప్రాంతంలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో మోడు బారాయి. ఫుట్‌పాత్‌లపై నీడనిచ్చే చెట్లను తొలగించడంపై పాదచారులు పెదవి విరుస్తున్నారు.

జర మూతలు ఏర్పాటు చేయండి..



సుభాష్‌నగర్‌లో భూగర్భడ్రైనేజీపై మూతలేని దృశ్యం

జీడిమెట్ల: భూగర్భడ్రైనేజీ మ్యాన్‌హోళ్లపై మూతలను ఏర్పాటు చేయాలని సుభాష్‌నగర్ ప్రజలు కోరుతున్నారు. డివిజన్ పరిధిలోని లాస్ట్ బస్టాప్ ప్రాంతంలో మ్యాన్‌హోళ్లపై ఉన్న పైకప్పు మూతలు విరిగిపోయాయి. దీంతో రాత్రిపూట కాలనడకన, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు చూసుకోకుండా ప్రమాదాల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకుని మ్యాన్‌హోళ్లపై మూతలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.